## ఎస్ఐఆర్ లో నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

- నిర్ణీత గడువులోగా పరిశీలన, హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి )** ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, అదేవిధంగా నిర్ణీత గడువులోగా పరిశీలన, హియరింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను, అదనపు కలెక్టర్లను

మిగతా 2 లో...


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 8 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 10


- సర్వే చిక్కులు దాటి.. టేకాఫ్ అయ్యేనా?
- ఆరు ప్రతిపాదిత ప్రాంతాల్లో ఏఏఐ బృందం క్షేత్రస్థాయి సర్వే..
- రన్ వే ఏర్పాటుకు భూమి, భౌగోళిక పరిస్థితులపై పరిశీలన
- అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్ పై సాంకేతిక అధ్యయనం
- రైల్వే లైన్ ప్రభావంపై ప్రత్యేక పరిశీలన
- ఏటీఆర్ -72తో పాటు ఏ320, ఏ321 విమానాల రాకపోకలపై అంచనా
- రెండు రోజుల పరిశీలన అనంతరం సాధ్యాసాధ్యాల నివేదిక



# సర్వే చిక్కులు దాటి..
# టేకాఫ్ అయ్యేనా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విమానాశ్రయం కలకు మళ్లీ కదలికలు వచ్చాయి. ఏళ్లుగా ప్రతిపాదనలు, స్థల సర్వేలు, సాంకేతిక పరిశీలనలతో సాగుతున్న ప్రక్రియకు తాజాగా ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రంగంలోకి దిగడంతో కొత్త ఆశలు నెలకొన్నాయి. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకున్న బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



2 లో..

# పర్మిషన్ లేని గ్యాస్ దందా?

- ప్రజల ప్రాణాలతో హెచ్పీ గ్యాస్ నిర్వహకుల చెలగాటం?
- పట్టణ నడిబొడ్డునే నిర్వహణ.. పక్కనే 700 మంది విద్యార్థుల పాఠశాల!

## గుంతల రహదారులు..
# ప్రయాణమంటేనే భయం!

- రోడ్లపై మృత్యువు పొంచి ఉన్న పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో మరింత అధ్వానంగా మారిన రోడ్లు.. ప్రమాదాలు జరుగుతున్నా నిద్ర వలయంలో అధికారులు



**అశ్వాపురం, సెప్టెంబర్, 7,ప్రజాజ్యోతి** మండల పరిధిలోని పలు ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో రహదారులపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. గుంతల లోతు,

మిగతా 2 లో...

## ఎస్ఐఆర్ లో నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

, ఆదేశించారు, సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ ఓలు, ఏఈఆర్ ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాకు సంబంధించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన డాక్యుమెంట్ల ఆధారంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.సంబంధిత ఈఆర్ ఓలు నిర్దేశిత కార్యాచరణ ప్రకారం హియరింగ్ లు నిర్వహించి, పరిశీలన అనంతరం సరైన , సంబంధిత డాక్యుమెంట్లను మాత్రమే పోర్టల్ లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ లాగిన్ లలో పెండింగ్ లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిశీలించి క్లియర్ చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి జిల్లా స్థాయిలో, అలాగే ఈఆర్ ఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు నోటీసులు అందించిన వెంటనే, సమర్పించాల్సిన డాక్యుమెంట్లు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 60 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.హియరింగ్ లను నిర్దేశిత కార్యాచరణ ప్రకారం నిర్వహిస్తున్నామని, ఓటర్లు సరైన డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న నో మ్యాపింగ్, అనామోలీస్ కు సంబంధించిన ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



# పర్మిషన్ లేని గ్యాస్ దందా?

- ప్రజల ప్రాణాలతో హెచ్పీ గ్యాస్ నిర్వహకుల చెలగాటం?
- పట్టణ నడిబొడ్డునే నిర్వహణ.. పక్కనే 700 మంది విద్యార్థుల పాఠశాల!

**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 7** పట్టణ నడిబొడ్డున అనుమతులు లేకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

### ›› స్కూల్ పక్కనే గ్యాస్ నిల్వలు

గ్యాస్ ఏజెన్సీకి సమీపంలోనే సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాల ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించే ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ల నిర్వహణ జరుగుతుండటంతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### "ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా?"

**పాఠశాల పక్కనే గ్యాస్ సిలిండర్ల నిర్వహణపై అధికారులు వెంటనే స్పందించి, అనుమతులు మరియు భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని స్థానికుల డిమాండ్. ప్రజా భద్రతపై రాజీ వద్దు.. అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అధికారులు స్పష్టం చేయాలి**

### ›› చుట్టూ జనావాసాలు.. మధ్యలో గ్యాస్ వ్యాపారం

ఏజెన్సీ చుట్టుపక్కల జనావాసాలు ఉన్నప్పటికీ భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? గ్యాస్ నిల్వకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక శాఖ, పౌరసరఫరాలు, ఆయిల్ కంపెనీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ›› ప్రమాదం జరిగితే

### బాధ్యత ఎవరిది?

గ్యాస్ సిలిండర్ల విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పాఠశాల, జనావాసాలకు సమీపంలో ఇలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా నిర్వహణ జరుగుతుంటే ఇప్పటివరకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ›› అధికారుల తనిఖీలు ఎక్కడ?

గ్యాస్ ఏజెన్సీ నిర్వహణకు సంబంధించి అవసరమైన లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ అనుమతులు, నిల్వ సామర్థ్యం, గోదాం నిబంధనలు తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### ›› సివిల్ సప్లై డిటి ప్రభాకర్ రావు వివరణ

అశ్వరావుపేట హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ స్కూల్ పక్కనే నిర్వహిస్తున్నరు దీనిపై మీ వివరణ ఏమిటి అని ప్రజా జ్యోతి అడగగా నాకు ఖాళీ లేదు అనే సమాధానం ఇచ్చారు

# గుంతల రహదారులు.. ప్రయాణమంటేనే భయం!

(మొదటి పేజీ తరువాయి...)

వెడల్పు తెలియక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గుంతలు కనిపించవు.. ప్రమాదాలు ఆగవు

వర్షం కురిసిన సమయంలో రహదారిపై నీరు చేరడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం కష్టంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, సరుకు రవాణా వాహనాలు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం పెరుగుతోంది.రహదారి దుస్థితిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. చిన్న గుంతలను సకాలంలో పూడ్చి ఉంటే అవి పెద్ద గుంతలుగా మారేవి కావని, అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే సమస్య తీవ్రతరం అవుతోందని ప్రజలు మండిపడుతున్నారు.

### ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం ఏదీ?

రహదారి ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ఇంటికి ఆధారంగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి చేరుతోంది.ప్రమాదం జరిగిన తర్వాత పరామర్శలు, హామీలు ఇవ్వడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు."ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రహదారులపై ప్రమాదకర గుంతలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### మంత్రులు వస్తేనే రోడ్లకు మరమ్మతులా?

ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, మంత్రులు లేదా ఉన్నతాధికారులు పర్యటించే సమయంలోనే రహదారులపై ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రుల పర్యటన సమయంలో హడావుడిగా రహదారులను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం వంటి చర్యలు చేపడితే సాధారణ ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.మంత్రులు వస్తేనే ఆర్ అండ్ బీ అధికారులు నిద్ర మత్తు నుంచి బయటకు వస్తారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా రహదారుల నిర్వహణపై అధికారులు నిరంతరం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

### వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమం

వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారుల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, గుంతలు పూడ్చేందుకు తాత్కాలిక చర్యలు కాకుండా నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, అవసరమైన చోట వేగ నియంత్రణ సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

### ఇకనైనా స్పందిస్తారా?

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన గుంతల సమస్యపై ఆర్ అండ్ బీ అధికారులు ఇకనైనా స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కాకుండా ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు. రోడ్లు ప్రయాణానికి మార్గాలు మాత్రమే కాదు.. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే బాధ్యత కూడా అధికారులదే అని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 7, (ప్రజా జ్యోతి)**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు, సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని అన్నారు, తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు...**

దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు చెందిన బానోతు భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నార చీరల వద్ద కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గోదావరి వరదల కారణంగా షాపు నీట మునిగిందని, తిరిగి షాపు ఏర్పాటు చేసుకునే సమయంలో తన స్థలంలో వేరే వ్యక్తులు షాపు ఏర్పాటు చేశారని,ఈ విషయంపై తహసీల్దార్ కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, తన షాపు స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ కు ఎండార్స్ చేశారు. జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ ప్రజలు గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గుండి సౌజన్య అంగన్వాడీ టీచర్ పోస్టుకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హత సాధించానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు అర్హతలను పరిశీలించి అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన 65 గిరిజన కుటుంబాలు సుమారు 35 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నామని తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. గ్రామానికి అంగన్వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామానికి చెందిన ధనసరి పగిడిద్దరాజు సర్వే నంబర్ 617లో తనకు ఐదు ఎకరాల పట్టా భూమి ఉండగా, సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన మూడు ఎకరాల భూమికి సంబంధించిన పాత రికార్డులను సవరించి, తన పేరుపై నూతన పట్టాదారు పాస్ బుక్ జారీ చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# విమానాశ్రయ స్థల పరిశీలనకు ఏఏఐ బృందం

- **గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు**
- **విమాన రాకపోకలకు సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్ వే ను పరిశీలించిన బృందం**
- **నైట్ ల్యాండింగ్ కు అవసరమయ్యే భద్రత సదుపాయాలపై అధ్యయనం చేసిన బృందం**

**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 7,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లాల ప్రజల చిరకాల కోరికైనా విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర విమాన శాఖ మంత్రితో చర్చలు జరపగా తుమ్మల విజ్ఞప్తి మేరకు సోమవారం కొత్తగూడెం జిల్లాలో ఏ ఏ ఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం పర్యటించింది సాంకేతిక బృందం విస్తృతంగా పర్యటించింది, కేంద్ర బృందం పర్యటనతో జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడినట్లు అయింది, విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు చేరుకున్న ఈ బృందం మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది. జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే , సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది. ఈ సందర్భంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏ టి ఆర్-72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ 320/A321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు, పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా సాంకేతిక బృందం పరిశీలనలో ప్రధాన అంశంగా నిలిచింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల ఏర్పడే సాంకేతిక ప్రభావాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను కూడా పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశంపై చర్యలు చేపట్టనున్నారు. పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులు సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ , సాంకేతిక రికార్డులను సిద్ధంగా ఉంచి ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలిస్తూ, రికార్డులతో సరిపోల్చి బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, బృందం క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించగా, రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు, సాంకేతిక అంశాలను బృందం పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు, ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.



# మూడేళ్ల పెండింగ్ విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి

- **ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వరికి ఐదు గ్రామ పంచాయతీల సర్పంచుల వినతి**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో డి. రాజేశ్వరికి సర్పంచులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ విద్యుత్ బిల్లుల కారణంగా గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోందని వారు తెలిపారు. పంచాయతీలకు వచ్చే పరిమిత నిధులతో విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అభివృద్ధి పనులకు నిధులు వినియోగించాల్సి ఉంటుందని సర్పంచులు తెలిపారు. అందువల్ల గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసి గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, పెంట్లం సర్పంచ్ కారం శివ, మర్రిగూడెం సర్పంచ్ సృజన, తొట్టిపంపు సర్పంచ్ సంఘవి, ఊటుపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పెంట్లంలో టీబీ ముక్త భారత్ అభియాన్ ఉచిత వైద్య శిబిరం

- **మొబైల్ ఎక్స్‌రే ద్వారా 63 మందికి పరీక్షలు.. 13 మంది టీబీ అనుమానితుల గుర్తింపు**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పెంట్లం గ్రామ పంచాయతీలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కారం శివ ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ పర్యవేక్షణలో డిజిటల్ మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ద్వారా 63 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మందికి టీబీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, కళ్లెంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ సూచించారు. అనుమానితులకు కళ్లె (స్పుటమ్), రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి, టీబీ నిర్ధారణ అయిన వారికి ఉచిత మందులు, పూర్తి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. నిక్షయ్ పోషణ యోజన కింద టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. మండలంలోని అబ్బుగూడెం గ్రామ పంచాయతీలో ఈనెల 9న, పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో ఈనెల 11న మొబైల్ ఎక్స్‌రే శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటమ్మ, టీబీ సూపర్‌వైజర్ వెంకట్, ఎక్స్‌రే టెక్నీషియన్ సాయికృష్ణ, ఆశా కార్యకర్తలు ప్రియాంక, లక్ష్మి, రాధ, జ్యోతి, నాగమ్మ పాల్గొన్నారు.

# దళిత స్పీకర్ ను అవమానించడం నేరం కాదా?

- దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే



ఆశ్వారావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 7

తాతా మధు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలి – ప్రజాస్వామ్యానికి క్షమాపణ చెప్పాలి లేకపోతే జిల్లా కాంగ్రెస్ పార్టీ సారధ్యం లో నిరవధిక దీక్షకు సిద్ధం: బోడ రమేష్ ఈరోజు అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభాపతిని అవమానించేలా అనుచిత పదజాలం ఉపయోగించారనే ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓట్లతో, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ ద్వారా పదవులు పొందిన ప్రజాప్రతినిధులు రాజ్యాంగ విలువలకు, సభా గౌరవానికి, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఉంది. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం అనేది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు–సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం వంటి రాజ్యాంగ విలువలను అవమానించినట్లే. ఇలాంటి భాషను, ఇలాంటి ప్రవర్తనను ప్రజాస్వామ్య సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. కాబట్టి తాతా మధు వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, సభా నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ప్రజాస్వామ్యానికి మరియు సభా గౌరవానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం. మా డిమాండ్లపై తక్షణమే ప్రభుత్వం స్పందించాలి ఇది వ్యక్తిగత రాజకీయ పోరాటం కాదు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేసే పోరాటం. రాజ్యాంగాన్ని అవమానించేలా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించే ఏ నాయకుడైనా ప్రజల ముందు సమాధానం చెప్పాల్సిందే. రాజ్యాంగం మనకు హక్కులు ఇచ్చింది – ఆ రాజ్యాంగాన్ని కాపాడటం మన బాధ్యత. ప్రజాస్వామ్యం మన బలం – దాన్ని కించపరిచే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు మండల ప్రెసిడెంట్ చిన్నంశెట్టి సత్యనారాయణ కౌన్సిలర్ లు మిండా హరి బాబు నార్లపాటి దివాకర్ అల్లాడి రామారావు కాంగ్రెస్ నాయకులు బండి చెన్నారెడ్డి నారాయణపురం ఉప సర్పంచ్ ఆకుల శ్రీను ఆసుపాక యూత్ కరీం వీరనాల నాగు లు నారాయణపురం గ్రామశాక అధ్యక్షుడు సిహెచ్ నాగేంద్ర మరియు పరిటాల సందీప్ పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- ప్రతి ముస్లిం ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి
- అతా నిజాముద్దీన్ బాబా



కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి) మహ్మద్ ప్రవక్త జన్మదిన మాసం రబీ ఉల్ అవ్వల్‌ను పురస్కరించుకుని దారుల్ ఉలూం నూరియా హనఫియా హిఫ్జ్ మదర్సా అధ్యక్షుడు షేక్ యూసఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ వక్త అతా నిజాముద్దీన్ బాబా హాజరై మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. పేదల పట్ల దయ, కరుణ, ప్రేమ కలిగి ఉండాలని, నిరాడంబర జీవితాన్ని గడుపుతూ యావత్ ప్రపంచంలో ఇస్లాం వ్యాప్తికి మహ్మద్ ప్రవక్త కృషి చేశారని అన్నారు, ప్రతి ముస్లిం ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని, తద్వారా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం మదర్సా చైర్మన్ యాకూబ్ పాషా మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ఆశయ సాధన దిశగా ప్రతి ఏడాది మిలాద్ ఉన్ నబీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం నెలకొల్పేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్సా కమిటీ సభ్యులు గౌస్ పాషా, ఇక్బాల్ తో పాటు స్థానిక మసీదులకు చెందిన ఇమామ్‌లు మౌలానా సర్వరాజ్ ఆలం, మౌలానా ఖుస్రు అహ్మద్, మౌలానా ఇమ్రాన్ రజా, ఖాజీ రఫీయుద్దీన్, అబ్దుల్ సలాం, షఫూద్ రజా తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

- తాతా మధు వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి
- అశ్వాపురంలో కాంగ్రెస్ కార్యకర్తల డిమాండ్



అశ్వాపురం, సెప్టెంబర్7,ప్రజాజ్యోతి : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అశ్వాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. స్పీకర్ పదవికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను తాతా మధు వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకూడదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.

## డివైఎస్పిని సన్మానించిన ఐఎన్టియుసి నేతలు



ఇల్లందు, సెప్టెంబర్, 7 (ప్రజా జ్యోతి) గోదావరిఖని నుంచి ఇల్లందు ఏరియాకు బదిలీపై వచ్చిన డివైఎస్పి (సివిల్) విజయ్ సాగర్ ను సోమవారం ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సివిల్ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. సివిల్ ఏఈ ప్రజ్వల్, ఈఈ ఖాన్ బాషా, సివిల్ సూపర్వైజర్ మహేష్, సంజయ్, జనరల్ అసిస్టెంట్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాత మధు పై చర్యలు తీసుకోవాలి



ఇల్లందు, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్ లు కోరారు. సోమవారం తాత మధు వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత స్పీకర్ను ఉద్దేశించి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసిన అవమానకర వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ను అవమానించే విధంగా ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సమాజం మనోభావాలను కించపరిచే చేసిన వ్యాఖ్యలను తాతా మధు వెంటనే వెనక్కి తీసుకొని, దళిత సమాజానికి, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆయన చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ తాతా మధును పదవి నుంచి తొలగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు




చర్ల, సెప్టెంబర్ 07: (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆరో రోజు నిరసన చేపట్టారు. మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ ఐనవోలు పవన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 33 నెలల బకాయిలు, కళ్యాణలక్ష్మి–షాదీముబారక్ పథకంలో తులం బంగారం, ఆసరా పెన్షన్లు, విద్యార్థులకు స్కూటీలు, దివ్యాంగుల పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ.12 వేలు, ఆటో కార్మికులకు రూ.12 వేలు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, యడ్ల రామదాసు, తోటపల్లి మాధవరావు, యువజన నాయకులు కాకి అనిల్, అంబోజి సతీష్, కొంబత్తి రాము, తడికల బుల్లెబ్బాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, కట్టదం కన్నారావు, కారం కన్నారావు, సంతపూరి సతీష్, కుక్కదపు సాయి, గాదంశెట్టి కిషోర్, పాసిగంటి సంతోష్, తడికల చంద్రశేఖర్, రావుల కిషోర్, మేడబత్తిని గోవర్ధన్, రాట్నాల శ్రీరామ్మూర్తి, మైప వెంకటేశ్వర్లు, తడికల వెంకటేశ్వర్లు, మామిడి రాజు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను వేగ వంతంగా పూర్తి చేయాలి
- పుష్కరాలకు అవసర మైన భూసేకరణ ప్రతి పాదనను ప్రభుత్వానికి పంపాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్






కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి) గోదావరి పుష్కరాల సందర్భంగా టైర్–1లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్,కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లా కలెక్టర్లతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల టైర్–1లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి పంపించి, ఆమోదాలు త్వరగా పొందేలా నిరంతరం ఫాలోఅప్ చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించాలని, పనులు ప్రారంభమైన వెంటనే అవసరమైన కార్మికులు, నిర్మాణ సామగ్రి, యంత్రాలు తదితర వనరులను అందుబాటులో ఉంచుకునేలా ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.టెండర్లకు కాంట్రాక్టర్లు స్పందించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. నోడల్ అధికారి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాల టైర్–1లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువు లోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూసేకరణ, టెండర్ ప్రక్రియలను వేగవంతం చేసి పనులు త్వరగా ప్రారంభించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేస్తామని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల మధ్య డంపింగ్ యార్డు తొలగించాలి

- చెత్త తగులబెట్టడంతో విషవాయువులు.. అనారోగ్యాల బారిన స్థానికులు
- శ్మశానవాటికకు వెళ్లే మార్గాన్ని చెత్తతో మూసేయడం దారుణం
- డంపింగ్ యార్డు తరలించకపోతే కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తాం: నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి :** జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును తక్షణమే మరో ప్రాంతానికి తరలించాలని సీపీఐ 1 టౌన్ కార్యదర్శి నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం నివాస ప్రాంతాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారంటూ స్థానిక ప్రజలతో కలిసి సోమవారం యార్డు వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నివాస గృహాలకు సమీపంలోనే ప్రతిరోజూ చెత్తను డంప్ చేసి తగులబెట్టడంతో విషవాయువులు వెలువడుతున్నాయని, దీంతో స్థానికులు ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా శ్మశానవాటికకు వెళ్లే రహదారిపై సైతం చెత్తను కుప్పలుగా వేయడంతో మృతదేహాలను దహనం, ఖననం చేసేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. శ్మశానవాటికకు వెళ్లే మార్గం లేక శవాలను డంపింగ్ యార్డు సమీపంలోనే ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడకుండా డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భవాని ప్రసాద్, నాగరాజు, బండి మంగ, అరుణ, రామ్మూర్తి, రామారావు, సరోజిని, సాయి, మంద బాబు, రాంపండు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాలపై క్రూరత్వాన్ని హరికట్టాలని డీఎస్పీకి బీజేపీ ప్రతినిధుల వినతి



**కొత్తగూడెం కలెక్టరేట్, భద్రాచలం / సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి)** భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులతో ఇసుక బండ్లు లాగిస్తూ అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా పదేపదే తిప్పడం, అలసిపోయిన మూగజీవాలను కొట్టడం వంటి చర్యలను అరికట్టాలని కోరుతూ బిజెపి బృందం సోమవారం భద్రాచలం డీఎస్పీ, ఎస్‌డీపీఓ ఎం.అరుణ్ కుమార్ను కలిసి వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ గోదావరి ఇసుక ర్యాంపుల నుంచి భద్రాచలం పట్టణం వైపు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్న సమయంలో మూగజీవాలపై జరుగుతున్న క్రూరత్వాన్ని తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ బృందం కోరినట్లు తెలిపారు, పశువులతో పని చేయించడం సంప్రదాయంలో భాగమే అయినప్పటికీ, అధిక బరువులు మోయిస్తూ, విశ్రాంతి లేకుండా నడిపిస్తూ, కొట్టడం మాత్రం క్రూరత్వమే అని అన్నారు.భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి పవిత్ర క్షేత్రమని, గోమాతను గౌరవించే సంస్కృతిలో మూగజీవాలపై క్రూరత్వానికి తావులేకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ బృందం డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ నాయకులు కుంజా ధర్మా, నిడదవోలు నాగబాబు, ముత్యాల చంద్రశేఖర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలి

**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, వారికి నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జిలుకర పద్మ డిమాండ్ చేశారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలను చర్చించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. చలో హైదరాబాద్‌లో భాగంగా ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ధర్నాకు హాజరవుతున్న విషయాన్ని తెలియజేస్తూ వైద్యశాఖ డీపీఓకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిలుకర పద్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే అంశాలపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల పీఆర్సీ బకాయిలతో పాటు లెప్రసీ, పల్స్‌పోలియో తదితర విధులకు సంబంధించిన ప్రింటింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్‌సీడీ ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, స్కూటీమీ డబ్బాలు మోయించకూడదని, ఎన్సీ, పీఎన్‌సీ తదితర టార్గెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల వేతనాలతో కూడిన మెడికల్ సెలవులు, ఆదివారాలు, పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించకపోతే దశలవారీగా పోరాటాలను ఉధృతం చేస్తామని పద్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా జిల్లా అధ్యక్షురాలు యూనీస్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్య తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

- తోటమల్ల వరప్రసాద్



**చర్ల, సెప్టెంబర్ 07 : (ప్రజాజ్యోతి):** రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు వెలువడిన అనుచిత వ్యాఖ్యలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు తోటమల్ల వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కన్నీరు పెట్టుకోవడం తనను ఎంతగానో కలచివేసిందన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ పట్ల గౌరవం, మర్యాద పాటించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. రాజకీయ అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ సంస్థల గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సముచితం కాదన్నారు.అదేవిధంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం అధికారిక విధి నిర్వహణలో జోక్యం చేసుకోవడం వంటి చర్యలను సమర్థించలేమని స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టపరమైన అంశాలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ సంస్థల గౌరవం, శాసనసభ ప్రతిష్ట, పోలీసు వ్యవస్థ విధి నిర్వహణకు భంగం కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వరప్రసాద్ అన్నారు.రాజకీయ నాయకులు తమ నిరసనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేస్తూ చట్టాన్ని రాజ్యాంగ సంస్థలను గౌరవించాలని కోరారు.

## ఎంపీ రఘురాంరెడ్డికి ఘనస్వాగతం పలికిన కొత్వాల

- సీతంపేటలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ సర్వేలో ఎంపీతో కలిసి పాల్గొన్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్



**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందంతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించిన సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఘనస్వాగతం పలికారు.సోమవారం సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్నతో కలిసి కొత్వాల శ్రీనివాసరావు ఎంపీ రఘురాంరెడ్డికి శాలువా కప్పి సత్కరించి స్వాగతం పలికారు.అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సుజాతనగర్ మండలం సీతంపేటలో ఏఏఐ బృందం చేపట్టిన సర్వే, క్షేత్రస్థాయి పరిశీలనలో ఎంపీ రఘురాంరెడ్డితో పాటు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులు తదితర అంశాలను ఏఏఐ అధికారులు పరిశీలించిన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో ఎంపీ, కాంగ్రెస్ నాయకులు చర్చించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, అటవీ, ఏఏఐ శాఖల అధికారులు, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కొండం వెంకన్న, బూసి శ్రీను, బొందిలి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల సమస్యలపై ప్రజావాణిలో వినతి

- పేదలకు ఇళ్లు, అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి



**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పాల్వంచ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచనలతో పాల్వంచ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విశ్వనాథం, మల్లెల శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అర్హత మేరకు పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చే యాలని, ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని డి మాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని, పలు ప్రాంతాలు మురికి, దుర్వాసనతో నిండిపోయాయని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మడవి సరస్వతి, మాజీ వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, మాజీ ఎంపీటీసీ వీరన్న, మాజీ సర్పంచులు బిచ్చు చందు, రమేష్, ఉదయభాస్కర్, శ్రీశైలం, నాగేశ్వరరావు, వసంతరావుతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసీ సమస్యలపై మహాసభ

**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లోని ఇంద్రాపార్క్ వద్ద నిర్వహించనున్న 'ఆదివాసుల ఆత్మగోస మహాసభ'కు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర పిలుపునిచ్చారు.చర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడాలను షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి తొలగించే అంశంపై రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియలో సమగ్ర విచారణ చేపట్టి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కు ఎవరికి చెందాలో రాజ్యాంగబద్ధమైన విచారణ ద్వారా తేల్చాలని అన్నారు.ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, విద్యా–ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కుల ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అక్రమంగా పొందిన ధృవీకరణ పత్రాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల రక్షణకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పంచాయతీల విస్తరణ (షెడ్యూల్డ్ ప్రాంతాల) చట్టంను, అటవీ హక్కుల చట్టం–2006ను సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. పోడు భూముల సమస్యను పరిష్కరించి అర్హులైన ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని అన్నారు.ఆదివాసీలు తరతరాలుగా జల్–జంగల్–జమీన్ కోసం పోరాడారని, భూమి, అడవి, సంస్కృతి, అస్తిత్వ పరిరక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేశారని రాజు దొర గుర్తు చేశారు. ఇక మౌనం వీడి హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.తెలంగాణలోని ప్రతి ఆదివాసీ గ్రామం నుంచి యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఆదివాసీ యువనేత పాయల కన్నారావు, తుడుందెబ్బ నాయకులు శ్యామల తరుణ్, జిల్లా ఉపాధ్యక్షుడు సోడే అనిల్‌కుమార్, సుబ్బంపేట సర్పంచ్ కాక సత్యనారాయణ, కాక రాంబాబు, రేగా ఆంధ్రయ్య, కాక ముత్యాలరావు, పూనెం శివ, తాటి భూపతిదొర, కాక నర్సింహారావు, ఆదివాసీ మహిళా ఐక్య కార్యాచరణ సమితి నాయకురాలు బీరబోయిన రాణి, ఇరప అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



## జీఓ 97 రద్దు చేయాలి

- రాహుల్ గాంధీకి పోస్ట్‌కార్డుల ద్వారా ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థుల వినతి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం రాహుల్ గాంధీకి పోస్ట్‌కార్డుల ద్వారా వినతి తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల విజయ్ మాట్లాడుతూ ఎస్‌బీటీఈటీ బోర్డును యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయడం వల్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్య కార్పొరేటీకరణకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య దూరమయ్యే అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు ఉద్యోగాల్లో ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని జీఓ 97ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సింగరేణి తదితర సంస్థల్లో సబ్ ఇంజనీర్ పోస్టులకు డిప్లొమా విద్యార్థులకు ఉన్న అర్హతలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, పాలిటెక్నిక్ కమిటీ సభ్యులు సలిగంటి జయదీప్, యశ్వంత్, ప్రియాన్షి, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్‌ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు శిక్షా రత్న-2026 పురస్కారం

**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** కేఎల్‌ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ ఎ. నరసింహారావుకు అకడమిక్ ఎక్సలెన్స్ విభాగంలో ప్రతిష్ఠాత్మక "శిక్షా రత్న–2026" పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చేస్తున్న కృషి, విద్యాసంస్థల అభివృద్ధిలో ప్రదర్శిస్తున్న నాయకత్వాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. హరి విశ్వవిద్యాలయం, సూపర్ ఏఐ అకాడమీ, అదాబ్ హైదరాబాద్, సాక్షి ఎడ్యుకేషన్, స్టడీ9 మీడియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించారు. కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా. వి. బాలకృష్ణారెడ్డి, ఐసీఏఆర్–ఏఐసీఆర్పీ డైరెక్టర్ డా. తారా సత్యవతి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఎ. నరసింహారావును అభినందించారు. విద్యారంగంలో ఆయన అందిస్తున్న సేవలకు "శిక్షా రత్న–2026" పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పురస్కారం తన విద్యారంగ సేవలకు లభించిన గౌరవప్రదమైన గుర్తింపుగా నిలిచిందని ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు పేర్కొన్నారు.




## మృతుడి కుటుంబానికి ఆటో డ్రైవర్ల ఆర్థిక సాయం



**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఆటో మెకానిక్ కుటుంబానికి నేతాజీ ఆటో యూనియన్ నటరాజ్ సెంటర్–పాల్వంచ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఆర్థిక సహాయం అందించారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆటో మెకానిక్ వడ్లకొండ అనిల్ (48) కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు నేతాజీ ఆటో యూనియన్ నటరాజ్ సెంటర్–పాల్వంచ అధ్యక్షుడు శెట్టిపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు తమ వంతు సహాయంగా రూ.33 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. అనిల్ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లు సమష్టిగా ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోతు ప్రసాద్, లకావత్ శ్రీను, బోసెట్టి నరేష్, బర్ల లక్ష్మణరావు, చక్రాల శ్రీను, కొండలరావు, మహేశ్వర చారి, పజిల్ బాలు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సుక్మాలో నక్సలైట్ డంప్ గుర్తింపు

- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం



**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా బలగాలు భారీగా నక్సలైట్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నబోడ్కేల్ అటవీ–కొండ ప్రాంతంలో సుక్మా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త బృందం నిర్వహించిన గాలింపు చర్యల్లో నక్సలైట్లు దాచిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం సెప్టెంబర్ 5న చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసు బలగాలు సంయుక్తంగా ప్రాంత ఆధిపత్యం, గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా అటవీ, కొండ ప్రాంతంలో అనుమానాస్పదంగా దాచిన నక్సలైట్ డంప్‌ను గుర్తించారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఒక భర్మర్ తుపాకీ, 57 బీజీఎల్ పైపులు, మూడు ఐఈడీ కంటైనర్లు, వైర్‌లెస్ సెట్, డిటోనేటర్, సుమారు ఒక కిలో గన్‌పౌడర్, మూడు కిలోల యూరియా, విద్యుత్ తీగలు, పెద్ద సంఖ్యలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నక్సల్ నిర్మూలన చర్యల్లో భాగంగా అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# 14 మావోయిస్టుల డంప్‌లు స్వాధీనం

- **ఆయుధాలు, ఐఈడీ సామగ్రి, డిటోనేటర్లు, వైర్‌లెస్ సెట్లు స్వాధీనం**



**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో సీఆర్‌పీఎఫ్ 199వ బెటాలియన్ భారీ విజయాన్ని సాధించింది. పిడియా, కుంపనడ్ ప్రాంతాల్లోని ఈడి, హరి, న్యాపారా, సర్పంచ్‌పారా గ్రామాల అటవీ ప్రాంతాల్లో నిర్వహించిన గాలింపు చర్యల్లో 14 నక్సల్ డంప్‌లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.పోలీసుల వివరాల ప్రకారం సెప్టెంబర్ 5న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్ 199వ బెటాలియన్‌కు చెందిన ఒక కంపెనీ, యంగ్ ప్లాటూన్‌తో కూడిన సంయుక్త బృందం గాలింపు చర్యలు చేపట్టింది. బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ కుమార్ మార్గదర్శకత్వంలో, డిప్యూటీ కమాండెంట్ దర్శన్ యాదవ్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. బి/199, ఎఫ్/199 కంపెనీలకు చెందిన ఇన్‌స్పెక్టర్లు అజిత్ కుమార్ దేకా, నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు.నక్సలైట్లు భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకునేందుకు ఆయుధాలు, పేలుడు పదార్థాలను అడవిలో దాచిపెట్టినట్లు అందిన సమాచారంతో భద్రతా బలగాలు అప్రమత్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో దాచిన 14 నక్సల్ నిల్వ కేంద్రాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక 303 బోల్ట్ యాక్షన్ రైఫిల్, ఐదు భర్మర్ రైఫిళ్లు, ఒక స్వదేశీ 12 బోర్ రైఫిల్, ఎనిమిది డిటోనేటర్లు, కోడెక్స్ వైర్, 10 ఐఈడీలు, బ్యాటరీ లేని ఒక వైర్‌లెస్ సెట్, నాలుగు ప్లాస్టిక్ కంటైనర్లు, మూడు పెద్ద స్టీల్ కంటైనర్లు, ఐఈడీ తయారీ సామగ్రి, వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు, నక్సల్ దుస్తులు, ఇతర సామగ్రి ఉన్నాయి.పత్రికా ప్రకటన ప్రకారం మొత్తం 99 రకాల వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. స్వాధీనం చేసుకున్న ఐఈడీలు, ఇతర పేలుడు పదార్థాలను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు.అడవిలో దాచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను నక్సలైట్లు భద్రతా బలగాలపై దాడులకు, హింసాత్మక కార్యకలాపాలకు ఉపయోగించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. డంప్‌లను సకాలంలో గుర్తించడం ద్వారా పెద్ద ప్రమాదం తప్పినట్లయిందని పేర్కొన్నారు.పిడియా, హరి, కుంపనడ్ పరిసర ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ 199వ బెటాలియన్ నిరంతర ఆపరేషన్లతో నక్సలైట్ల ప్రభావం తగ్గుతోందని అధికారులు తెలిపారు. భద్రతా చర్యలతో స్థానికుల్లో నూతన భద్రతా భావన పెరుగుతోందన్నారు.ఈ సందర్భంగా కమాండెంట్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజల భద్రత, శాంతి, అభివృద్ధికి తమ బలగం కట్టుబడి ఉందన్నారు. విశ్వసనీయ సమాచారంతో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తూ ఈ ప్రాంతాన్ని నక్సల్ రహితంగా మార్చే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

## కేఎల్ఆర్ గ్రూప్ చైర్‌పర్సన్ కె. నాగమణికి శిక్షా రత్న-2026




**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ కె. నాగమణికి ప్రతిష్ఠాత్మక "శిక్షా రత్న–2026" పురస్కారం లభించింది. విద్యాసంస్థల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, ఆధునిక విద్యా విధానాలను ప్రోత్సహించడం వంటి సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. హరి విశ్వవిద్యాలయం, సూపర్ ఏఐ అకాడమీ, అదాబ్ హైదరాబాద్, సాక్షి ఎడ్యుకేషన్, స్టడీ9 మీడియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా. వి. బాలకృష్ణారెడ్డి, ఐసీఏఆర్–ఏఐసీఆర్పీ డైరెక్టర్ డా. తారా సత్యవతి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై, వారి సమక్షంలో కె. నాగమణికి పురస్కారాన్ని అందజేశారు. కె. నాగమణి నాయకత్వంలో కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆధునిక మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాల అందుబాటులో ఆమె చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు అభినందించారు. "శిక్షా రత్న–2026" పురస్కారం కె. నాగమణి విద్యారంగ సేవలకు, దూరదృష్టితో కూడిన నాయకత్వానికి, విద్యాసంస్థల అభివృద్ధికి చేసిన కృషికి లభించిన గౌరవప్రదమైన గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కె. నాగమణికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె నాయకత్వంలో సంస్థలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## బొల్లోరిగూడెంలో ఘనంగా కర్ర పూజ



**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:**పాల్వంచ పట్టణంలోని బొల్లోరిగూడెం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో రామాలయం సమీపంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఘనంగా కర్ర పూజ నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒకటో డివిజన్ కార్పొరేటర్ సిరపు సుగుణారెడ్డి కర్ర పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోరగట్ల వెంకట నారాయణ మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అండర్-16 జట్టుకు పాల్వంచ క్రికెటర్లు సృజంత్, దివాకర్, ప్రిన్స్ ఎంపిక







**పాల్వంచ, సెప్టెంబర్ 7, ప్రజాజ్యోతి:**పాల్వంచకు చెందిన నెక్స్ట్ జెన్ క్రికెట్ అకాడమీకి చెందిన ప్రతిభావంతులైన క్రికెటర్లు సృజంత్, దివాకర్, ప్రిన్స్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్–16 జట్టుకు ఎంపికయ్యారు. ముగ్గురు ఆటగాళ్లు తమ ప్రతిభను చాటుకుని జట్టులో చోటు సంపాదించడం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. హెచ్‌సీఏ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సృజంత్, దివాకర్, ప్రిన్స్ అండర్–16 జట్టుకు ఎంపికయ్యారు. వారి ఎంపిక పట్ల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నెక్స్ట్ జెన్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు అభిమన్యు, శరత్ కళ్యాణ్, పవన్ సాయి, పవన్ సీలపోగు మాట్లాడుతూ.. తమ అకాడమీ ఆటగాళ్లు హెచ్‌సీఏ అండర్–16 జట్టుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, నిరంతర సాధనతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పాల్వంచకు, అకాడమీకి మంచి పేరు తీసుకురావాలని కోచ్‌లు, క్రీడాభిమానులు ఆకాంక్షించారు.

## ఆర్.కొత్తగూడెం అభివృద్ధే నా లక్ష్యం

- **ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్**




**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** ఆర్ .కొత్తగూడెం గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మండలంలోనే నెంబర్ వన్ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ తుర్రం రవికుమార్ అన్నారు.సోమవారం చర్ల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాపు కృష్ణార్జున, దానవాయిపేటకు చెందిన రుంజ రాజాతో కలిసి మండల నోడల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఆర్ .కొత్తగూడెం గ్రామ సమాఖ్య సంఘాలకు (ద్వారా వీవో) భవన నిర్మాణానికి స్థలం లేక మహిళా సంఘాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. గ్రామ సెంటర్ లో అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో సర్పంచ్ గా గెలిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్ సహకారంతో గ్రామానికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఇప్పటికే గ్రామంలో రహదారులు, సైడ్ డ్రైనేజీలు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తున్నానన్నారు.రానున్న రోజుల్లో ఆర్ .కొత్తగూడెం గ్రామపంచాయతీని మండలంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని తన పదవీకాలం పూర్తయ్యే వరకు గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ రవికుమార్ తెలిపారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- **420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను విస్మరించారు: బిఆర్ఎస్ యువజన మండల అధ్యక్షులు గద్దల రామకృష్ణ**




**అశ్వాపురం, సెప్టెంబర్7,(ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అశ్వాపురం మండల యువజన బీఆర్ఎస్ అధ్యక్షుడు గద్దల రామకృష్ణ విమర్శించారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు.

**ప్రజావాణిలో వినతిపత్రాలు....**మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యలపై పోరుబాట....**ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాటకు శ్రీకారం చుడుతున్నట్లు గద్దల రామకృష్ణ తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రజావాణిలో వినతి పత్రం హామీల అమలుకు బిఆర్ఎస్ పోరుబాట లో చల్ల రాజేష్,బిఆర్ ఎస్ ఎస్ సి సెల్ మండల అధ్యక్షుడు మైనార్టీ యూత్ నాయకులు నజీర్ సోను అశోక్ పాల్గొన్నారు.

## దాడికి నిరసనగా బీఆర్ఎస్ రాస్తారోకో



**ములకలపల్లి సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఆ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు దాడి చేశారంటూ నిరసనగా బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ములకలపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడంతో పాటు పోలీసులతో దాడి చేయించడం అమానుషమన్నారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుర్రం శ్రీను, భద్రు, బండి కొమురయ్య, రాజారావు, ప్రవీణ్, నందు, నర్సింహారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీష హత్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

- రూ.కోటి పరిహారం.. ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి: టీడీపీ



**ములకలపల్లి:** హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతీ దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. టిడిపి ఖమ్మం పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కట్రం స్వామిదొరలు స్థానిక నాయకులతో కలసి సోమవారం మండలంలోని చౌటిగూడెం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువతి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నడిబొడ్డున ఇలాంటి దారుణ ఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి, మండల కార్యదర్శి చల్లా వెంకటేశ్వరరావు, ములకలపల్లి సీనియర్ నాయకులు కోమళ్ళ దుర్గాప్రసాద్, తెల్లం రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఐదు వినతులు



**ములకలపల్లి సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** మండల రైతు వేదికలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు వినతిపత్రాలు అందినట్లు ఎంపీడీఓ ఎస్.వి. సత్యనారాయణ తెలిపారు. పోడు భూమి ఆక్రమణ, కాటిల్ షెడ్ బిల్లు, ఒంటరి మహిళ, వితంతు పెన్షన్లకు సంబంధించిన సమస్యలపై బాధితులు వినతులు సమర్పించినట్లు చెప్పారు. వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీమతి భాగ్యలక్ష్మి , టీజీఎన్‌పీడీసీఎల్ ఏఈ బి. నరేష్‌కుమార్, మిషన్ భగీరథ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్.ఆర్.ఎస్.ఎస్. వరప్రసాద్, హౌసింగ్ ఏఈ కె. సాహిత్య, వ్యవసాయ అధికారి బి. అరుణ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. సామ్రాజ్యం, ఎంఈఓ జి. సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ డా. పి. రామకృష్ణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. సువర్చాల, ఏపీఓ ఎ. హుస్సేన్, హెల్త్ సూపర్‌వైజర్ బి. శ్రీకృష్ణ, బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్. శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ కె. సుబ్బరాజు, ఎక్సైజ్ శాఖ అధికారి ఎం.డీ. రహమాన్‌బాబా, ఐకేపీ వెలుగు సీసీ ఆర్. ఉపేందర్, ఇరిగేషన్ సీనియర్ అసిస్టెంట్ కె. కమలాకర్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలపై దాడికి నిరసనగా రాస్తారోకో

- పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆగ్రహం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై జరిగిన దాడికి నిరసనగా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా సమస్యలపై గళం వినిపిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్న తీరు అప్రజాస్వామికమని విమర్శించారు. కేటీఆర్, హరీష్ రావులతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మెచ్చా నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వనమా కాలనీలో 12 అడుగుల భారీ కొండచిలువ

- భయాందోళనలో కాలనీ వాసులు



**కొత్తగూడెం కలెక్టరేట్ సెప్టెంబర్ 7,(ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని 7వ డివిజన్ వనమా కాలనీలో సోమవారం రాత్రి సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం కురుస్తుండటంతో పాటు కాలనీలో వీధి దీపాలు సరిగా లేకపోవడంతో పాము ఇళ్ల మధ్యకు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు.చీకటిలో భారీ పాము సంచరించడాన్ని గమనించిన స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా జంకారు. కాలనీలో వీధి దీపాల కొరత కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. భారీ పాము ఇళ్ల మధ్యకు రావడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు,కాలనిలో పలు ప్రాంతాలలో చెట్లు పోదలు ఉండడంతోనే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు ,స్థానిక కార్పొరేటర్ స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలుప్రజలు కోరుతున్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక డిమాండ్



**ములకలపల్లి సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తూ దారుణ హత్యకు గురైన ఆదివాసీ గిరిజన యువతి కుటుంబాన్ని సోమవారం జాతీయ ఆదివాసీ పాస్టర్స్ ఐక్య వేదిక ప్రతినిధులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, నర్సు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు అండగా నిలవాలని నాయకులు కోరారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి తమ వేదిక అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుమార్తెను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు వేదిక తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జాతీయ అధ్యక్షుడు కుర్సం నిరీక్షణరావు, ఉపాధ్యక్షుడు గుండి ఫిలిప్, సెక్రటరీ మడివి ఎలీషా, జాయింట్ సెక్రటరీ బండారు, జాతీయ కమిటీ సలహాదారులు పీటర్ సింగయ్య, బిజ్జా రవిబాబు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుర్సం దైవ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ కాక రమేష్ జాషువా, సీయోను కుమార్, రాంబాబు, రాజు, ఇశ్రాయేలు, జాన్‌బాబు, పెద్దము నాగేష్ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు



**చర్ల, సెప్టెంబర్ 07:(ప్రజాజ్యోతి):** గౌరవప్రదమైన అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు వెలువడిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత గౌరవప్రదమైన పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవిని కించపరిచేలా మాట్లాడటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని స్పష్టం చేశారు.అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయ్ నాయుడు డిమాండ్ చేశారు. అవసరమైతే ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు.ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా హుందాతనంతో వ్యవహరించాలని, భవిష్యత్తులో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## భక్తుల సందడితో శివమయమైన శివాలయం

- విశేష అభిషేకాలు, రుద్రాభిషేకాలతో శివనామస్మరణ





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి):** సోమవారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి శివాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి స్వామివారికి విశేష అభిషేకాలతో పాటు రుద్రాభిషేకం నిర్వహించడంతో శివాలయం శివనామ స్మరణతో శివమయంగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో సోమవారం ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# శిరీష హత్యపై ఒక్కటైన గళం..







- **న్యాయం జరిగే వరకు పోరాటం**
- **కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే రాజధాని ముట్టడిస్తాం: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కె. సాబీర్ పాషా**
- **రూ.కోటి పరిహారం.. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి: మేయర్ మూడ్ గణేష్**
- **ఫాస్ట్ ట్రాక్ కోర్టుతో విచారణ జరిపి త్వరిత గతిన శిక్షించాలి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య**
- **పని ప్రదేశాల్లో మహిళల రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి: సీపీఎం నేత కే. బ్రహ్మచారి**
- **బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం .. దర్యాప్తును వేగవంతం చేయాలి: కాంగ్రెస్ నేత మంద హనుమంతు**
- **అసెంబ్లీలో శిరీష హత్య అంశాన్ని ప్రస్తావిస్తా.. న్యాయం జరిగేలా చూస్తా: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 7, ప్రజా జ్యోతి :** నర్సు ఊకె శిరీష హత్య ఘటనపై న్యాయం కోసం రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చాయి. హంతకులను కఠినంగా శిక్షించాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. కేసును నీరుగార్చే ప్రయత్నం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో సోమవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం శేషగిరిభవన్ లో రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సలిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని శిరీష హత్య ఘటనపై తమ గళాన్ని వినిపించారు.

**సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కె. సాబీర్ పాషా..**

శిరీష హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసును నీరుగార్చే ప్రయత్నం జరిగితే రాజధాని ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించే తాత్కాలిక చర్యలు కాకుండా బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**మేయర్ మూడ్ గణేష్..**

శిరీష కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య..**

శిరీష హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, విచారణను వేగవంతం చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కే. బ్రహ్మచారి..**

పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు శిరీష కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ జిల్లా నాయకుడు మంద హనుమంతు..**

శిరీష కుటుంబానికి ప్రజాస్వామ్య శక్తులన్నీ అండగా నిలుస్తాయని తెలిపారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు..**

హైదరాబాద్ నుంచి ఫోన్ ద్వారా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. శిరీష హత్య ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, బాధిత కుటుంబానికి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**ఇతర నాయకుల డిమాండ్..**

న్యూ డెమోక్రసీ నాయకులు గౌని నాగేశ్వరరావు, ఉక్లా, ప్రజా సంఘాల నాయకులు సాలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, ఎస్ .కె. ఫహీం, చంద్ర అరుణ, ఎం.జ్యోతి, వాసం రామకృష్ణ, మద్దెల శివకుమార్, వర్క్ అజిత్, హరి కృష్ణ, రాంబాబు, రమేష్, ఆసిఫ్ ఉద్దీన్, రత్నకుమారి, మేడిని లక్ష్మి, బిక్షం, నాగ కృష్ణ తదితరులు పాల్గొని శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **ఆరు గ్యారెంటీలు....420 హామీలను తక్షణమే అమలు చేయాలి**
- **ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ శ్రేణులు**



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 7 (ప్రజాజ్యోతి ):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల నుంచి ఓట్లు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఆర్థికసాయంతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చాలని కోరారు. విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల చెల్లింపు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తదితర హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, ప్రజావాణిలో అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూపెల్లి నర్సింహారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, నాయకులు కొనకంచి శ్రీను, దారం కృష్ణారెడ్డి, గోనెల నాని, సాదిక్ పాషా, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, పూర్ణ, బెజ్జంకి కనకాచారి, గుల్మహ్మద్, బానోత్ శ్రీను, మోహన్, పంగి సురేష్, సర్పంచులు గుమ్మడి కృష్ణవేణి, బానోత్ సరోజ, రమణ, సాలయ్యతో పాటు బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ

**అనుచిత వ్యాఖ్యలపై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్సా వెంకట్ తీవ్ర ఖండన**



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, (ప్రజా జ్యోతి ):** శాసనసభ స్పీకర్ పై శాసనమండలి సభ్యుడు తా తా మధుసూదన్ చేసినట్లు వెల్లడైన అనుచిత వ్యాఖ్యలను అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్సా వెంకట్ తీవ్రంగా ఖండించారు. చట్టసభలో సభ్యులు పాటించాల్సిన గౌరవం, సభా సంప్రదాయాలను విస్మరించి ఇలాంటి వ్యాఖ్యలు చేయ డం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానకరమని అన్నారు. స్పీకర్ పదవి ఒక వ్యక్తికి మాత్రమే సంబంధించినది కాదని, అది మొత్తం శాసనసభకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని పేర్కొన్నారు. స్పీక ర్ ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడటం ఏమా త్రం సమర్థనీయం కాదన్నారు. ఈ ఘటనను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని పర్సా వెంకట్ కోరారు. సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ అంశాన్ని ప్రస్తావించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించిన తీరును ఆయన స్వాగతించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యత అని అన్నారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పర్సా వెంకట్ కోరారు.

## నర్సు మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- **ప్రైమ్ కేర్ ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: పౌర హక్కుల సంఘం**






**ములకలపల్లి సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆసుపత్రి లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉపేందర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం నర్సు కుటుంబాన్ని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. నాగేంద్రబాబుతో కలిసి ఉపేందర్‌రావు పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే యువతి మృతి చెందిందని ఆరోపించారు. నర్సు హత్య, అత్యాచారం ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఈ ఘటనలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందో వెలుగులోకి తీసుకురావాలన్నారు. బాధితురాలికి కనీస రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఆసుపత్రి యాజమాన్యం విస్మరించిందని ఆరోపించారు. ఈ ఘటనపై పౌర హక్కుల సంఘం హైదరాబాద్ నిజ నిర్ధారణ బృందం సంఘటన ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించిందని తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

- సర్వే చిక్కులు దాటి.. టేకాఫ్ అయ్యేనా?
- ఆరు ప్రతిపాదిత ప్రాంతాల్లో ఏఏఐ బృందం క్షేత్రస్థాయి సర్వే..
- రన్ వే ఏర్పాటుకు భూమి, భౌగోళిక పరిస్థితులపై పరిశీలన
- అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్ పై సాంకేతిక అధ్యయనం
- రైల్వే లైన్ ప్రభావంపై ప్రత్యేక పరిశీలన
- ఏటీఆర్ -72తో పాటు ఏ320, ఏ321 విమానాల రాకపోకలపై అంచనా
- రెండు రోజుల పరిశీలన అనంతరం సాధ్యాసాధ్యాల నివేదిక



# సర్వే చిక్కులు దాటి.. టేకాఫ్ అయ్యేనా?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విమానాశ్రయం కలకు మళ్లీ కదలికలు వచ్చాయి. ఏళ్లుగా ప్రతిపాదనలు, స్థల సర్వేలు, సాంకేతిక పరిశీలనలతో సాగుతున్న ప్రక్రియకు తాజాగా ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రంగంలోకి దిగడంతో కొత్త ఆశలు నెలకొన్నాయి. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకున్న బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఈసారి భూమి లభ్యతతో పాటు రన్ వే ఏర్పాటు, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు, భవిష్యత్ విస్తరణ, సమీపంలోని రైల్వే లైన్ ప్రభావం వంటి అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తోంది.

**ఆరు ప్రాంతాలలో పరిశీలన..**

విమానాశ్రయానికి ప్రతిపాదిత ప్రాంతాలుగా సుజాతనగర్ మండలంలోని సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ–దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో భూమి విస్తీర్ణం, స్థల హద్దులు, భౌగోళిక పరిస్థితులు, రన్ వే ఏర్పాటుకు అనువైన స్థితిని బృందం ప్రస్తుతం పరిశీలిస్తోంది. అయితే జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు గతంలోనూ పలు దఫాలు సర్వేలు జరిగాయి. గత ఏడాది ఏఏఐ బృందం సుజాతనగర్ పరిధిలోని ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించింది. అనంతరం కొన్ని ప్రాంతాల సాంకేతిక అనుకూలతపై అభ్యంతరాలు తలెత్తడంతో ప్రత్యామ్నాయ ప్రాంతాల అన్వేషణ కొనసాగింది. ఇటీవల నిర్వహించిన సాంకేతిక అధ్యయనాల్లో సీతంపేట–సుజాతనగర్ ప్రాంతానికి ప్రాధాన్యత లభించినట్లు సమాచారం. దీంతో తాజాగా ఏఏఐ బృందం మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**పెద్ద విమానాల రాకపోకలకు..**

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటీఆర్–72 తరహా విమానాలతో పాటు ఎయిర్ బస్ ఏ320, ఏ321 వంటి పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇందుకోసం సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్ వే అవసరమయ్యే అవకాశాలను అంచనా వేస్తున్నారు. నైట్ ల్యాండింగ్, భద్రతా పరికరాలు, భవిష్యత్ విస్తరణకు అవసరమైన స్థలం వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. ఇక ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలోని విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా కీలక అంశంగా మారింది. అది విమానాల అప్రోచ్ ఫన్నెల్ కు అడ్డంకిగా మారుతుందా అన్నదానిపై సాంకేతిక బృందం పరిశీలిస్తోంది. అవసరమైతే షిఫ్టింగ్ ద్వారా సమస్యను అధిగమించే అవకాశం, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్ ఓసీ పొందే అంశాలను కూడా పరిశీలిస్తున్నారు.

**ఏఏఐ బృందం సమీక్ష..**

సింగరేణి అతిథిగృహంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ తో ఏఏఐ బృందం సమావేశమై ప్రాజెక్టుపై చర్చించింది. విమానాశ్రయం ఏర్పాటుతో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊతం లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు. సాంకేతిక బృందానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. రెండు రోజుల పరిశీలన అనంతరం ఏఏఐ సమర్పించే సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక కీలకం కానుంది. గత సర్వేల చిక్కులు దాటి ఈసారి విమానాశ్రయ ప్రతిపాదన టేకాఫ్ దిశగా వెళ్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

**గత సర్వేల నుంచి.. తాజా పరిశీలన వరకు**

భద్రాద్రి కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై గతంలోనూ పలుమార్లు సర్వేలు జరిగాయి. ఏఏఐ బృందాలు ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించినప్పటికీ కొన్ని సాంకేతిక అంశాలు ముందుకు వచ్చాయి. దీంతో ప్రత్యామ్నాయ ప్రాంతాల అన్వేషణ కొనసాగింది. ఇటీవల సీతంపేట–సుజాతనగర్ ప్రాంతానికి ప్రాధాన్యత లభించగా, ఇప్పుడు ఏఏఐ మల్టీ డిసిప్లినరీ బృందం ఆరు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. రన్ వే, అప్రోచ్ ఫన్నెల్, రైల్వే లైన్, నైట్ ల్యాండింగ్, భవిష్యత్ విస్తరణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తుండటంతో ఈసారి ఏఏఐ నివేదికపైనే జిల్లావాసుల ఆశలు నిలిచాయి.

# ప్రజావాణిలో పశువైద్యం

- సిబ్బంది కొరతతో పాడి రైతుల అవస్థలు

**ములకలపల్లి సెప్టెంబర్ 07 (ప్రజాజ్యోతి):** మండలంలో పశువైద్య సిబ్బంది కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ములకలపల్లి పశువైద్యశాలలో సిబ్బంది లేకపోవడంతో సోమవారం వైద్యాధికారి ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో పశువైద్యశాలకు తాళాలు పడగా, తమ మూగజీవాలకు వైద్యం చేయించుకునేందుకు రైతులు వాటిని తోలుకుని ప్రజావాణి కార్యక్రమం వద్దకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ములకలపల్లికి చెందిన పాడి రైతు అన్నె శ్రీనివాస్‌కు చెందిన గేదె, మాధారం గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటేశ్వర్లుకు చెందిన మేక, కమలాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణకు చెందిన శునకాలు అనారోగ్యానికి గురయ్యాయి. దీంతో వాటిని ములకలపల్లి పశువైద్యశాలకు తీసుకురాగా, అక్కడ వైద్యాధికారి లేకపోవడంతో రైతులు ప్రజావాణి వద్దకు చేరుకున్నారు. పశువైద్యాధికారి పి. రామకృష్ణను కలిసి తమ మూగజీవాలకు వైద్యం అందించాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే చికిత్స అందించడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాడి రైతు అన్నె శ్రీనివాస్ మండలంలో ఖాళీగా ఉన్న పశువైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

**సిబ్బంది కొరతతో మూగ జీవాలకు అందని వైద్యం**

మండలంలోని మూగజీవాలకు వైద్యసేవలు అందించేందుకు ములకలపల్లి పశువైద్యశాలతో పాటు పూసుగూడెం సబ్‌సెంటర్ ఉన్నాయి. ములకలపల్లి పశువైద్యశాలలో వైద్యాధికారి, ఓఎస్, కాంపౌండర్ పోస్టులు కలిపి మూడు ఉండగా, ప్రస్తుతం వైద్యాధికారి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. పూసుగూడెం సబ్‌సెంటర్‌లో ఓఎస్, కాంపౌండర్



పోస్టులు ఉండగా కాంపౌండర్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మొత్తం ఐదు పోస్టుల్లో మూడు ఖాళీగా ఉండటంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారి గెజిటెడ్ అధికారి కావడంతో ఆయనకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే బాధ్యతలతో పాటు శాఖాపరమైన సమావేశాలు, ఇతర అధికారిక విధులలో బిజీగా ఉంటున్నారని రైతులు తెలిపారు. ఒకే అధికారిపై అనేక బాధ్యతలు ఉండటంతో పశువైద్య సేవలకు ఆటంకం కలుగే పరిస్థితులు నెలకొన్నాయి. అత్యవసర సమయంలో పశువులకు వైద్య సేవలకు ఆటంకం కలుగుతుంది.. పాడిపశువులే జీవనాధారంగా ఉన్న రైతులకు సకాలంలో వైద్యం అందకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఖాళీగా ఉన్న పశువైద్య, సహాయక సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేసి, రైతులకు నిరంతరం వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

**ప్రజావాణిలో దరఖాస్తును పట్టించుకోలేదా....?**

మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పశువైద్య సిబ్బందిని నియమించి పాడి రైతుల సమస్యను పరిష్కరించాలని, మూగజీవాలకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని ములకలపల్లికి చెందిన రైతు అన్నె శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అయితే ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులకు సంబంధించి అధికారులు మీడియాకు అందించిన సమాచారంలో ఈ దరఖాస్తు వివరాలను పొందుపరచపోడం గమనార్హం. మీడియాకే మరిచారా లేదా ఉన్నతాధికారులకు సైతం నివేదించలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.